ఆంధ్రజ్యోతి

andhrajyothy.com మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.2 । కనిష్ఠం 25.4







మహేష్‌కుమార్ గౌడ్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

శ్రీరామ నవమి ఉత్సవాలకు రావాలి

- మహేష్‌కుమార్ గౌడ్‌కు ఆహ్వాన పత్రికను అందజేసిన ఆలయ కమిటీ ప్రతినిధులు

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఖిల్లా రఘునాథ ఆలయంలో నిర్వహించనున్న శ్రీరామ నవమి ఉత్సవాలకు రావాలని ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 6న ఆలయంలో నిర్వహించనున్న కల్యాణోత్సవానికి హాజరుకావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, ఎస్ఎస్ఆర్ కళాశాల అధినేత మారయ్యగౌడ్, రాజేంద్రప్రసాద్, బంటు బలరాం, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్, దీప్తికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆరు కిలోల బియ్యంలో
ఐదు కిలోలు ఇచ్చేది కేంద్రమే!

- రేషన్ షాపుల వద్ద ప్రధాని ఫొటోను ఏర్పాటు చేయాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న ఆరు కిలోల సన్న బియ్యంలో ఐదు కిలోల బియ్యం ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమే అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులా చారి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సహకారంతో కొనుగోలు చేస్తున్న బియ్యం రైతులకు ఎలాంటి ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశ్యంతో చర్యలు తీసుకుంటుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న సహాయాన్ని దాచి పెట్టి రాష్ట్ర ప్రభుత్వమే పేదలకు ఉచితంగా సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటుందని అన్నారు. ప్రతియేటా రాష్ట్రంలో పేదలకు బియ్యానికి కేంద్ర ప్రభుత్వం రూ.10వేల కోట్ల వ్యయం చేస్తుండగా.. రాష్ట్ర ప్రభుత్వం రూ.2వేల కోట్లు మాత్రమే ఖర్చు చేస్తుందని తెలిపారు. నిరుపేదలకు మూడు పూటల ఆహారాన్ని అందించాలనే సంకల్పంతో కరోనా నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోచన పథకం కింద ఉచితంగా రేషన్ బియ్యం అందిస్తుందని తెలిపారు. రేషన్ షాపుల వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలు పోసి అభిషేకాలు చేస్తుందని ప్రధాని నరేంద్రమోదీకి మాత్రం ఎలాంటి అభిమానాన్ని చూపడం లేదని అన్నారు. రేషన్ షాపులలో నరేంద్రమోదీ ఫొటోను పెట్టి రేషన్ బియ్యాన్ని అందజేయాలని అన్నారు.

హెచ్‌సీయూ భూముల విషయంలో
ప్రభుత్వం వెనక్కి తగ్గాలి

యూనివర్సిటీ భూముల వేలాన్ని ఆపాలి 7

టీయూ ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



- నగరంలో రేషన్ షాపుల వద్ద బారులు తీరిన లబ్ధిదారులు





- రేషన్ షాపుల వద్ద లబ్ధిదారుల బారులు
- ప్రతీ కార్డు సభ్యుడికి ఆరు కిలోల చొప్పున బియ్యం అందజేత
- జిల్లాలో 759 రేషన్ షాపుల ద్వారా 8,248 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేయనున్న అధికారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న రేషన్ లబ్ధిదారులు

సన్న బియ్యం పంపిణీ షురూ



నిజామాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో సన్నబియ్యం పంపిణీ మొదలైంది. అన్ని రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్నబియ్యం పంపిణీ మొదలు పెట్టారు. ఆహార భద్రత, అంత్యోదయ, అన్నపూర్ణ కార్డులు ఉన్న వారందరికీ బియ్యం పంపిణీ చేపడుతున్నారు. జిల్లాలో ఈ నెల మొత్తం 8,248 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు. దొడ్డురకం బియ్యాన్ని నిలిపివేసి సన్నబియ్యం పంపిణీ మొదలు పెట్టారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం కార్డులు ఉన్న వారితో పాటు కొత్తగా కార్డులు మంజూరయ్యే వారికి కూడా ఈ సన్నబియ్యాన్ని అందించనున్నారు.

అట్టహాసంగా ప్రారంభం

జిల్లా వ్యాప్తంగా అన్ని రేషన్ షాపుల పరిధిలో ఈ బియ్యం పంపిణీ అట్టహాసంగా చేపట్టారు. అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని పంపిణీ మొదలు పెట్టారు. జిల్లాలోని 759 రేషన్ షాపుల ద్వారా కార్డుదారులకు సన్న బియ్యాన్ని అందిస్తున్నారు. ప్రతీ కార్డులో ఉన్న ఒక్కో సభ్యునికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో ఆహార భద్రత కార్డులు 3లక్షల 40,222 ఉన్నాయి. వీటి పరిధిలో 12లక్షల 50,996 మంది సభ్యులు ఉన్నారు. వీరి కోసం ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున 7,505.85 మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. అంత్యోదయ కార్డులు జిల్లాలో 20,916 ఉండగా వీటి పరిధిలో సభ్యులు 57,997 మంది ఉన్నారు. వీరికి 732 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అందిస్తున్నారు. అన్నపూర్ణ కార్డులు 1016 ఉండగా 1039 మంది సభ్యులు ఉన్నారు. వీరి కోసం 10.16 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా రేషన్ షాపుల ద్వారా మొత్తం 8,248 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఈ దఫా పంపిణీ చేయనున్నారు. ఈనెల 25 వరకు ఈ బియ్యాన్ని పంపిణీ చేయనున్నారు.

బియ్యం పక్కదారికి అడ్డుకట్ట

దొడ్డుబియ్యం సరఫరా నిలిచిపోవడం వల్ల సన్నబియ్యం పక్కదారి పట్టే అవకాశం లేదు. అందరూ సన్నబియ్యాన్ని తింటుండటం వల్ల ప్రతి ఒక్కరూ బియ్యాన్ని ఉపయోగిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. అన్ని రేషన్ షాపుల వద్ద నిఘాను కొనసాగిస్తూనే ప్రతి కార్డుదారునికి అందే విధంగా ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఎక్కువగా సన్నరకం ధాన్యాన్ని పండిస్తుండటం వల్ల కస్టం మిల్లింగ్ కింద వచ్చే సన్నరకం బియ్యాన్ని రేషన్ షాపులకు మళ్లించి అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

రేషన్ షాపుల వద్ద బారులు

జిల్లా వ్యాప్తంగా సన్నబియ్యం పంపిణీ మొదలు పెట్టడంతో ఉదయం నుంచే షాపుల వద్ద బారులు తీరారు. మొదటి సారిగా సన్నబియ్యం పంపిణీ మొదలు పెట్టడంతో ఎక్కువ మంది క్యూలైన్‌లో ఉండి బియ్యాన్ని తీసుకున్నారు. గతంలో మాదిరిగా కాకుండా మొదటి తారీకునే సన్నబియ్యం పంపిణీ మొదలు పెట్టడంతో ఎక్కువ మంది రేషన్ షాపులకు తరలివచ్చారు. జిల్లాలోని అన్ని రేషన్ షాపుల ద్వారా ఈ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు డీఎం సివిల్ సప్లయి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కార్డుదారులందరికీ సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. కొత్తగా కార్డులు వచ్చేవారికి కూడా ఈ బియ్యాన్ని అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ బియ్యాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.



ఇది ప్రజల ప్రభుత్వం..
: ఎండీ జాఫర్, దుబ్బ

ప్రజల ప్రభుత్వం కాబట్టే సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తుంది. దొడ్డుబియ్యం కంటే సన్నబియ్యం అందరూ వినియోగిస్తారు. ఈనెల నుంచి సన్నబియ్యాన్ని పంపిణీ చేయడం సంతోషకరం. బియ్యంలో నాణ్యత పాటించి వినియోగదారులకు అందించాలి.




సన్న బియ్యం ఇవ్వడం సంతోషం..
: జయ, ఆదర్శనగర్

రేషన్ షాపుల్లో సన్నబియ్యం ఇవ్వడం సంతోషకరం. చిన్నప్పటి నుంచి ఈ రేషన్ షాపుల్లో సన్నబియ్యం ఇవ్వడం చూడలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు సన్నబియ్యం ఇచ్చింది.



నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలి..
: దేవమ్మ, దుబ్బ

రేషన్ షాపుల్లో సన్నబియ్యం నాణ్యమైనవి ఇవ్వాలి. ప్రస్తుతం ఇస్తున్న బియ్యం లాగే ప్రతీనెల ఇదే విధంగా పంపిణీ చేయాలి. గతంలో దొడ్డు బియ్యం ఇచ్చిన నాణ్యత ఉండకపోయేది. నెల నెల అధికారులు పర్యవేక్షిస్తూ అందరికీ సన్నబియ్యాన్ని అందే విధంగా చూడాలి.





వడ్డీ దోపిడీకి అడ్డేది?

- అధిక వడ్డీల పేరిట ప్రజల నడ్డీ విరుస్తున్న వ్యాపారులు
- లైసెన్సులు లేకుండానే యథేచ్ఛగా వ్యాపారం
- డబ్బులు చెల్లించకుంటే తాకట్టుపెట్టిన ఆస్తుల జప్తు
- వడ్డీలు చెల్లించి ఆర్థికంగా నష్టపోతున్న బాధితులు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ సబ్ డివిజన్‌లోని వివిధ మండలాల్లో వడ్డీ వ్యాపారుల దోపిడీకి అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అమాయకుల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చి ప్రజల నడ్డీ విరుస్తున్నారు. ఎలాంటి లైసెన్సులు లేకుండానే చాటుమాటుగా జీరో ఫైనాన్స్ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరగా చేసుకొని వడ్డీ వ్యాపారులు, బంగారం, వాహనాలు తాకట్టు, వ్యవసాయ భూముల వార్డిగేజ్ లాంటి విభిన్న పద్ధతులలో వ్యాపారులు వారికి డబ్బులు ఇచ్చి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నూటికి పది రూపాయల వడ్డీ వసూలు చేస్తూ ప్రజలను నిలువునా దోపిడీ చేస్తున్నారు. నిర్ణీత గడువులోగా తిరిగి డబ్బు చెల్లించని పక్షంలో వారు కుదువ పెట్టిన బంగారు ఆభరణాలు, వ్యవసాయ భూములు, ఇతర వస్తువులు జప్తు చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఫైనాన్స్‌లు..

గతంలో ప్రభుత్వం నుంచి లైసెన్స్ తీసుకుని ఫైనాన్స్ వ్యాపారాలు చేసేవారు. లైసెన్స్ తీసుకుంటే ప్రతి సంవత్సరం రిన్యూవల్ చేయించాల్సి ఉంటుంది. ఇందుకు ఎంతోకొంత రుసుము చెల్లించాలి. కానీ వడ్డీ వ్యాపారులు ఇవేమి లేకుండా గుట్టుగా ఇంటివద్దనే వ్యాపారం సాగిస్తున్నారు. అంతేకాకుండా వివిధ మండలాల్లో అడ్డాలు (మడిగెలు) ఏర్పాటు చేసుకొని, బంగారం తాకట్టు పెట్టుకొని డబ్బులు వడ్డీకి ఇస్తున్నారు. బంగారం ధర రోజురోజుకూ పెరుగుతుండడంతో వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. బంగారం కుదువ పెట్టి డబ్బులు తీసుకున్నవారు నిర్ణీత గడువులోగా అసలు, వడ్డీ చెల్లించని పక్షంలో బంగారం అమ్ముకుంటామని వారిపై ఒత్తిడి చేసి డబ్బులు రాబట్టుకుంటున్నారు. అంతేకాకుండా పలుచోట్ల వడ్డీ వ్యాపారులు తమ డబ్బులు రికవరీలో భాగంగా గృహాలను సైతం, తమ ఆధీనంలోకి తీసుకున్న సంఘటనలు ఉన్నాయి. బంగారం ధర పెరగడంతో వడ్డీ వ్యాపారులకు తమ డబ్బులు సేఫ్ అనే భావన కలుగుతోంది.

గతంలో దాడులు జరిగినా..

గతంలో వడ్డీ వ్యాపారులపై టాస్క్‌ఫోర్స్ అధికారులు వివిధ మండలాల్లో ఫైనాన్స్‌లపై, వడ్డీ వ్యాపారుల గృహాలపై దాడులు జరిపారు. ఈ దాడులలో భీమ్‌గల్, కమ్మర్‌పల్లి ప్రాంతాలల్లో పెద్ద ఎత్తున డాక్యుమెంట్లను (అప్పు తీసుకున్నవారు రాసి ఇచ్చిన ప్రామీసరి నోట్లు) స్వాధీనం చేసుకున్నారు. అయినప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ప్రచారం జరిగింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు నిర్వహిస్తూ ప్రజల నుంచి అధిక వడ్డీ వసూలు చేసి పేద ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వడ్డీ వ్యాపారులపై ప్రభుత్వం దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



అధిక వడ్డీ వసూలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు సునీల్ అరెస్టు

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని చర్చి కంపౌడ్ ఆవరణలో గల బీఆర్ఎస్ నాయకుడు సునీల్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అధిక వడ్డీ వసూలు చేస్తున్నందున అరెస్టు చేసినట్లు తెలిసింది. అందిన సమాచారం మేరకు సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు సునీల్ ఇంటిపై దాడులు నిర్వహించగా సుమారు 34 ద్విచక్ర వాహనాలు లభ్యమైనట్లు తెలిసింది. ద్విచక్ర వాహనాలను తనఖా పెట్టుకొని అధిక వడ్డీకి డబ్బులను ఇస్తున్నట్లు తెలియడంతో అతడిని అరెస్టు చేసి, ద్విచక్ర వాహనాలను స్థానిక పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు సమాచారం.

ఉద్యోగుల సహకారంతో డీసీసీబీ లాభాల బాట

- డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి

నిజామాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఉద్యోగుల సహకారంతో లాభాల బాట పట్టిందని చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి అన్నారు. బ్యాంక్ ఆవరణలో మంగళవారం అచీవ్‌మెంట్ సెలబ్రేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొన్నేళ్లుగా ప్రతీ సంవత్సరం నష్టాల్లో ఉన్న బ్యాంక్ 2024-25 ఆర్థిక సంవత్సరంలో 27 కోట్ల రూపాయల లాభాలను ఆర్జించిందన్నారు. కేంద్ర బ్యాంకు పరిధిలోని అన్ని బ్యాంకు శాఖల ఉద్యోగుల కృషి వల్లే ఇది సాధ్యమైందన్నారు. గత సంవత్సరం రెండున్నర కోట్ల నష్టాలతో ఉండగా దాన్ని అధిగమించి లాభాలు వచ్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేశారని అన్నారు. ఎన్‌పీఏ శాతాన్ని కూడా గణనీయంగా తగ్గించారని అన్నారు. రుణాలు వసూలు చేయడంలో ముందుండటం వల్ల ఇది సాధ్యమైందని అన్నారు. గత సంవత్సరం 12 శాతంగా ఉన్న ఎన్‌పీఏ ప్రస్తుతం 7.82 శాతంగా మారిందన్నారు. బ్యాంకులో అందరి కృషి వల్ల డిపాజిట్లు 781.82 కోట్లు వచ్చాయన్నారు. స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రుణాలు 1355 కోట్లు ఇచ్చామ న్నారు. ఇదే రీతిలో ఉద్యోగులు పనిచేస్తే రాష్ట్రస్థాయిలో బ్యాంకుకు పేరు వస్తుందని ఆయన అన్నారు. ప్రతీ సంవత్సరం ఏప్రిల్ 1న అచీవ్‌మెంట్ సెలబ్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉపాధ్యక్షుడు నల్ల చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, సీఈవో నాగభూషణం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో
దరఖాస్తులు అందించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధి పొందేందుకు, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువవికాసం పథకం కింద మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలోని ప్రజాపాలన సేవా కేంద్రాలు, మున్సిపల్ ప్రజాపాలన సేవా కేంద్రాలల్లో నేరుగా దరఖాస్తులు అందించవచ్చని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓబీసీ, ఈబీసీ వర్గాల నిరుద్యోగ యువత ఈ పథకం కింద దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను అన్ని ప్రజాపాలన సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను కుల, ఆదాయ, ఆధార్, పాన్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, ఫోన్ నెంబర్‌ను జతచేసి ప్రజాపాలన సేవా కేంద్రాలలో అందించాలని కలెక్టర్ సూచించారు. ఇదివరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా ప్రస్తుతం ఆఫ్‌లైన్ విధానంలో నేరుగా దరఖాస్తులను అందించేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. అన్ని ప్రజాపాలన సేవా కేంద్రాల్లో ఖాళీ దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సిబ్బంది సహకారం అందిస్తారని తెలిపారు. జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కాగా, ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు.

నత్తకే నడక నేర్పేలా!

- ఏడాదైనా పూర్తికాని కప్పలవాగు హైలెవల్ వంతెన నిర్మాణ పనులు
- కూలీలను సమకూర్చని కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు

7

పనిచేయని నిఘా నేత్రాలు!

- ఏడాది దాటినా పట్టించుకోని ఆర్మూర్ మున్సిపల్ అధికారులు

దర్యాపూర్ రైల్వేగేటు మూసి వేయొద్దని వినతి



దర్యాపూర్ రైల్వేగేటు వద్దకు వచ్చిన పలు గ్రామాల ప్రజలు

నవీపేట,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దర్యాపూర్‌కు చెందిన 187 నెంబర్ గల రైల్వేగేటును రైల్వే అండర్ బ్రిడ్జి పేరుతో మూసివేయొద్దని పలువురు స్థానిక రైల్వేగేటు వద్దకు తరలివచ్చారు. ప్రస్తుతం యాసంగి వరి కోత పనులు కొనసాగుతున్నందున రైల్వేగేటు బయట సుమారు ఆరు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు పడే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. పైగా పదోతరగతి వార్షిక పరీక్షలు కొసాగుతున్నందున సంబంధిత విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యే ప్రమాదముందని, రైల్వేగేటు మూసివేతను మరో వారం రోజుల పాటు వాయిదా వేయాలని వారు రైల్వే అధికారులను కోరారు. వారం రోజుల లోపు సమీప గ్రామాల ప్రజల సౌకర్యార్థం ప్రత్యామ్నాయ దారిని ఏర్పాటు చేస్తామని రైల్వే అధికారులు హామీ ఇచ్చినట్లు ఆయా గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న కుమార్, రమేష్, నిజామొద్దీన్, ముజాఫర్, దేవరాజ్ తదితరులున్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏ లోకి మార్చాలి



మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం నాయకులు

డొంకేశ్వర్,ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలిన ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం సభ్యులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ముదిరాజ్ లకు ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచిన హామీలను అమలు చేయలేదన్నారు. ముదిరాజ్‌లను బీసీడీ నుంచి బీసీ ఏ గ్రూపులనకు మార్చడం పై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని మండి పడ్డారు. ముదిరాజ్ ఫైనాన్స్ కార్పోరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్లు కేటాయించాలన్నారు. చదువుకున్న విద్యార్థులు రిజర్వేషన్ లేకపోవడం వల్ల ఉద్యోగాలు రాక గల్ఫ్ బాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం కాం గ్రెస్ ప్రభుత్వం నెలరోజుల లోగ బీసీఏలోకి మార్చకపోతే ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ముదిరాజ్‌లకు రిజర్వేషన్లు లేకపోవడం వల్ల అనేక రకాలుగా నష్ట పోతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు రాజేందర్, రాము, శ్యామ్, గంగాకిసాన్, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెగ్డోలిలో కుస్తీపోటీలు



హెగ్డోలిలో కొనసాగుతున్న కుస్తీపోటీలు

కోటగిరి, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామంలో మంగళవారం కుస్తీపోటీలు నిర్వహించారు. ఉగాది పర్వదినం జరిగిన రెండు రోజులకు హెగ్డోలిలో కుస్తీపోటీలు నిర్వహించడం ఆనవాయితీ. ఆయా గ్రామాల నుంచి కుస్తీవీరులు తరలి వచ్చి కుస్తీపోటీలలో పాల్గొన్నారు. కుస్తీపోటీలలో విజేతలకు నగదు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉమాకాంత్ దేశాయ్, నాగం సాయిలు, రాంబాబు, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

నేడు నందిపేటలో ఎమ్మెల్యే పైడి పర్యటన

నందిపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నందిపేట మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పర్యటిస్తారని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు నాగతారక తెలిపారు.ముందుగా ఉదయం 10గంటలకు వన్నెల్(కె) లోని కోఆపరేటివ్ నూతన భవనాన్ని ప్రారంభిస్తారని, అనంతరం 10.30 గంటలకుఖుద్వాన్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన గోదాంను ఆర్మూర్ ఎమ్మెల్యేపైడి రా కేష్ రెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు.ఈ కార్యక్రమానికి మండలంలోని బీజేపీ ప్రజాప్రతినిధులు,నాయకులు హాజరుకావాలని నాగతారక కోరారు.

ప్రజలు ఫోన్‌లలో వచ్చే పెట్టుబడులను నమ్మొద్దు

బోధన్‌రూరల్,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): నేడు రోజురోజుకు సైబర్ క్రైమ్‌లు జరుగుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. బోధన్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడికి పెట్టుబడిలో రూ.లక్ష లాభం వచ్చిందని సైబర్ నేరగాళ్లు ఒక మెసేజ్ పంపారు. దీనిని నమ్మిన యువకుడు సుమారు రూ.1.75లక్షల వరకు సైబర్ క్రైమ్ వారు పెట్టిన వ్యాపార పెట్టుబడిలో చెల్లించాడు.ఎంతకు డబ్బులు తిరిగి రాకపోవడంతో స్పందించకపోవడంతో ఆ నెంబర్లు స్విచ్చాఫ్ రావడంతో మంగళవారం బోధన్ పోలీసులను ఆశ్రయించాడు. వెంటనే సైబర్ క్రైమ్ కేసు నమోదు చేశామన్నారు. ప్రజలు ఇలాంటి ఫేక్ మెసెజ్‌లను నమ్మొద్దన్నారు. ఫోన్‌లలో పెట్టుబడులు పెట్టడం, బిజినెస్ చేయడం, ఇంత లాభం వచ్చిందంటూ వచ్చే ఫేక్ మెసెజ్‌లను నమ్మొద్దన్నారు.

దరఖాస్తులను మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలి

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి):రాజీవ్ యువవికాసం పథకం కింద స్వయం ఉపాధి పొందే లబ్ధిదారులు మున్సిపల్ కార్యా లయంలో దరఖాస్తులను అందజేయాలని మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓబీసీ, ఈబీసీ యువత ఆన్‌లైన్‌లో కానీ, మున్సిపల్ ప్రజా పాలన సేవా కేంద్రంలో ధరఖాస్తు చేసుకోవాలని కమీషనర్ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

భీమ్‌గల్‌రూరల్ , ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్కూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మాజీ సొసైటీ డైరెక్టర్ శ్రీధర్ గౌడ్, నాయకులు చిన్న కిష్టాగౌడ్, జనార్ధన్ గౌడ్, లింగాగౌడ్, నాగేష్ మంగళవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో మోర్తాడ్‌లోని ప్రజానిలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.వారందరికి ముత్యాల సునీల్ కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు స్వామి, రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

వేల్పూర్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామానికి చెందిన కొరివి మహేష్ కు ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం కాంగ్రెస్ నాయకులు బాధితునికి అందజేశారు. చెక్కు మంజూరికి సహకరించిన బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి సీఎంకి ధన్యవాదాలు తెలిపారు.



ఏర్గట్లలో లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని అందజేస్తున్న నాయకులు



అంబంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం



కంఠంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్

జిల్లా అంతటా సన్నబియ్యం పంపిణీ

ఏర్గట్ల,ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు ఉగాది కానుకగా సన్నబియ్యాన్ని అందజేస్తామన్న హామీమేరకు మంగళవారం మండలంలోని రేషన్‌షాప్‌ల వద్ద కాంగ్రెస్ నాయకులు సన్నం బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈసందర్భంగాసీఎంరేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, ఎండి మునీర్,సున్నపు అంజయ్య, రేండ్ల రమేష్, రొక్కెడసంజీవ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కోటగిరి: రుద్రూరు మండలం అంబం(ఆర్)గ్రామంలో మంగళవారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజలకు దొడ్డు రకం బదులు ఒక్కొక్కరికి ఆరు కిలోల సన్నబియ్యాన్ని అందజేయడం అభినందనీయమని మండల కాంగ్రెస్ నాయకులు రెంజర్ల గంగారాం కొనియాడారు.బియ్యం పంపిణీ కార్యక్రమంలో నాయకులు కపిల్, కుర్మ బాలయ్య, మహేష్, ఇందూరి గంగాధర్, దస్తగిరి, గంగాధర్, డీలర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

డొంకేశ్వర్: పేదలకు కడుపునిండా అన్నం పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియయం పంపిణీ చేస్తోందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి అన్నారు. డొంకేశ్వర్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సన్న బియ్యం పథకాన్ని కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోనే సన్న బియ్యం పంపిణీ చేస్తోందన్నారు. ఇంత కంటే మంచి పథకం మరొకటి ఉండదని వెల్లడించారు. ఈ పథకం ద్వారా రేషన్‌కార్డు కలిగిన ప్రతీ పేదవారికి లబ్ధి చేకూరుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు భూమేష్ రెడ్డి, సొసైటీ చైర్మన భరత్‌రెడ్డి, నాయకులు బాపురావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వర్ని: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని జాకోరా గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు దశరథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల గురించి ఆలోచించి సన్న బియ్యం పంపిణీ చేయడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో బంజా గంగారాం, చందా దత్తు, రాజుల గంగారాం తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: తెలంగాణ రాష్ట్రంలో సోనియమ్మ ఆశీస్సులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు రేషన్ షాపుల్లో సన్న బియ్యం కార్యక్రమం ప్రారంభించారని, ఎన్నికలలో ఇచ్చిన అన్ని హామీలను అమలు పర్చడం కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట తప్పకుండా మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. ఉగాది పండుగ నాటి నుంచి ప్రజలకు సన్న బియ్యం అందించబడతాయని, ప్రభుత్వం చెప్పిన మాట ప్రకారం రేషన్ షాపుల్లో సన్నబియ్యాన్ని అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు హున్సా, పెంటాఖుర్దు, తదితర గ్రామాలలో క్షీరాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, బోధన్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చీల శంకర్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, మందర్నా రవి, ఆదినారాయణ, తహసీల్దార్ విఠల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డిలతో నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నందిపేట:మండలంలోని ఖుద్వాన్‌పూర్,నందిపేట తదితర గ్రామాల్లో మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. అనంతరం ప్రభుత్వం సరఫరా చేసిన సన్న బియ్యాన్ని లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని కంఠం గ్రామంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు లబ్ధిదారులకు సన్నబియ్యం అందజే శారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, ఆర్మూర్ నియోజక వర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బైండ్ల ప్రశాంత్, నాయకులు సిలిండర్ లింగం,ఖదీర్, ఇసూబ్ ఉన్నారు.

ఆర్మూర్‌రూరల్:పట్టణంలోని పలురేషన్ షాపుల వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం పట్టణంలోని శాస్త్రీనగర్, టీచర్స్ కాలనీ, హౌజింగ్ బోర్డు, మామిడిపల్లిలోని 25వవార్డు, 8వవార్డు,పెర్కిట్‌లోని 4వ వార్డులలో గల రేషన్ షాపులో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, బట్టి విక్రమార్క, మహేష్‌కుమార్‌గౌడ్‌ల చిత్ర పటాలకు క్షీరాభిషేకం నిర్వ హించారు. పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, రవిగౌడ్,లింగాగౌడ్, ఆకుల రాము, సునీల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, అక్షయ్,నరేష్ పాల్గొన్నారు.అదే విధంగా దేగాం, పిప్రి, అంకాపూర్, ఆలూర్, చేపూర్, గోవింద్‌పేట్,సుర్బిర్యాల్, ఫత్తేపూర్ గ్రామాల్లో రేషన్‌దుకాణాలలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పిప్రి మాజీ సర్పంచ్ జీవన్‌రెడ్డి, దేగాం శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మండంలోని గోనుగోప్పుల గ్రామంలో మంగళవారం గ్రామశాఖ కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చరణ్‌గౌడ్, గ్రామ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: రాష్ట్రంలోని ప్రతీ నిరుపేద కుటుంబానికి సన్నరకం బియ్యాన్ని సరఫరాచేయడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం సన్నబియ్యం పథకాన్ని అమలు పరుస్తున్నదని పేదలందరు సద్వినియోగం చేసుకోవాలని కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పాలెపు నర్సయ్య అన్నారు. మంగళవారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని రేషన్ షాప్‌లో సన్నబియ్యం పంపిణి పథకాన్ని ఆయన ప్రారంభించి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి, మార్కెట్ కమిటి ఉపాధ్యక్షులు సుంకెట బుచ్చన్న, కాంగ్రెస్ నాయకులు వేముల గంగారెడ్డి, సింగిరెడ్డి శేఖర్, సాయికుమార్,ప్రసాద్, రేషన్ డీలర్లు , లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.

మెండోర: రాష్ట్రంలోని ప్రతీ నిరుపేద కుటుం బం కడుపునిండా భోజనం చేయడం లక్ష్యంగా ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించిందని వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యం రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారం భించి లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ టౌన్ అధ్యక్షుడు గుండోజి రవి, శ్రీనివాస్ గౌడ్, భూమేశ్వర్, గణేష్, రేషన్ డీలర్లు సందీప్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి: రాష్ట్రంలో ఉన్న పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎడపల్లి మాజీ సర్పంచ్ శంకర్ నాయుడు అన్నారు. మంగళవారం ఎడపల్లి మండల కేంద్రంలోని మూడోనంబరు రేషన్ షాపులో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు, నాయకులు తూట్కూర్ రవీంధర్ రెడ్డి, యాసాడ రాజ్ కుమార్, మనోజ్ కుమార్ తదితరులు ఉన్నారు.



జాన్కంపేట్ లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలంలోని అన్ని గ్రామాలలో మంగళవారం రేషన్ దుకాణాలలో ఉచిత సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. మునిపల్లిలో మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ ఎం. సాయిరెడ్డి ప్రారంభించి బియ్యాన్ని పంపిణీ చేశారు. అర్గుల్‌లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, తొర్లికొండలో ఆర్మూర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ తనిక రవి, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, జక్రాన్‌పల్లిలో నిజామాబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వినోద్, అర్గుల్ సింగిల్ విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, మాజీ సర్పంచ్ కాటిపల్లి నర్సారెడ్డి, మండల డిప్యూటి తహసీల్దార్ దత్తాద్రి, ఆర్ఐ ప్రవీణ్ కలిసి ఉచిత సన్నబియ్యం పంపిణీ చేశారు.

ముప్కాల్:మండలంలోని ఆయా గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమా న్ని కాంగ్రెస్ నాయ కులు మంగళావారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మగ్గిడి ముత్యం రెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చంద రవి, బద్దం సాగర్, చిన్నారెడ్డి, దేవగౌడ్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్:మోర్తాడ్‌లో సన్నబియ్యం కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకు లు మంగళవారం ప్రారంభించారు. పేదలకు సన్నబియ్యం అందజేస్తున్న సీఎంరేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు పుప్పాల అశోక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గిర్మాజి గోపి, విడిసి అధ్యక్షుడు జక్కం అశోక్, చొక్కాయి గంగారెడ్డి, మహిపాల్, సతీష్, శ్రీధర్, సుదామ్, బాబు, జైడి చిన్న గంగారాం పాల్గొన్నారు.

వేల్పూర్:వేల్పూర్‌మండలం జాన్కంపేట్‌లో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన సన్నబియ్యాన్ని కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి ముత్యాలసునీల్‌రెడ్డికి లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్ గౌడ్ నాయకులు జేమ్స్ గంగారెడ్డి, సౌద శ్రీనివాస్, కిశోర్ గౌడ్, జైరాజ్, సురేష్, రాయుడు, గాంధీ, నరేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

● కొత్తపల్లిలో సన్నబియ్యం పంపిణీ

వేల్పూర్ మండలం కొత్తపల్లిలో మంగళవారం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటి ఉపాధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి ప్రారంభించారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● తహసీల్దార్ శ్రావణ్ కుమార్



దండిగుట్టలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

రెంజల్,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని దండిగుట్ట, కూనేపల్లి, రెంజల్, నీలా గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ ఏపీఎం చిన్నయ్య,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోబిన్ ఖాన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని దళారుల పాలు చేయకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలన్నారు. రైతులకు ప్రభుత్వం మద్దతు ధరతో పాటు బోనస్‌ను అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం తూకం వేయాలని, తేమశాతాన్ని పరిశీలించి కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవోరఫీ, నాయకులు సాయిరెడ్డి, జావీదోద్దీన్, ధనుంజయ్, ఎం ఎల్ రాజు, సాయిబాబాగౌడ్, కుర్మెశ్రీను, మహిళ సమాఖ్యఅధ్యక్షురాలు లక్ష్మి, ఇందిరా, సీసీలు శ్యామల, రాజయ్య, కృష్ణ, భాస్కర్, శివ, తదితరులు పాల్గొన్నారు.

● రైతులు దళారులను ఆశ్రయించొద్దు

రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని దూపల్లి సొసైటీ చైర్మన్ భూమారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దూపల్లి గ్రామంలో సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ప్రభుత్వం బోనస్ అందిస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, బాబన్న, కాశం సాయిలు, వరలక్ష్మి, సీఈవో జీవన్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని నాగేపూర్, కోస్లీలలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందని ఐకేపీ ఏపీఎం భూమేష్ గౌడ్ తెలిపారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు.

● బినోలలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మండలంలోని బినోల, నిజాంపూర్‌లలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. బినోల సొసైటీ ఆధ్వర్యంలో ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2320, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2300 చెల్లించడం జరుగుతుందని, రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, వైస్ చైర్మన్ బాబర్, విజయ్, బాల్ చందర్ గౌడ్, ప్రదీప్ రావు, మహేందర్, దేవేందర్, పోశెట్టి, కార్యదర్శి రమేష్ తదితరులున్నారు.

వేల్పూర్:వేల్పూర్ మండలం రామన్నపేట్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సాహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేందాన్ని మంగళవారం సొసైటీ చైర్మన్ జాగిరపు మోహన్‌రెడ్డి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సొసైటి వైస్ చైర్మన్ గడ్డం మల్లేష్, డైరెక్టర్లు ఎలుక శంకర్‌గౌడ్, గడ్డం మహిపాల్, కుర్మ నర్సయ్య, సోమ గంగాధర్, రాజారపు రాజేశ్వర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు గుమ్ముల కిషన్, కార్యదర్శి మగ్గిడి రణవీర్, సొసైటీ సిబ్బంది , రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఏర్గట్లలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలో మంగళవారం రూ.25 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మండలంలోని సీసీ రోడ్ల నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ.25లక్షలు బాల్కొండ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి ముత్యాలసునీల్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణరావులు మంజూరీ చేయించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోళ్ల శివకుమార్, రేండ్ల రాజారెడ్డి, బద్ధం లింగారెడ్డి, గడ్డం జీవన్, దండెవోయిన సాయికుమార్,మునిమాణిక్యం అజయ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ సమావేశంలో అన్వేష్‌రెడ్డి



మహేష్ కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

వేల్పూర్,ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి):హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మంగళవారం జరిగిన తెలంగాణ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ కమిటీ, జిల్లాల అధ్యక్షుల సమావేశానికి రాష్ట్రవిత్తనాభివృద్ధి చైర్మన్ అన్వేష్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, నేషనల్ కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ అఖిలేష్ శుక్లలు హాజరయ్యారు. ఈసందర్భంగా కిసాన్ న్యాయయోధ మెంబర్ షిప్ కార్యక్రమాన్నివారు ప్రారంభించారు.ఈసందర్భంగా అఖ్లేష్‌శుక్ల, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లను అన్వేష్‌రెడ్డి శాలువతో సన్మానించారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

కోటగిరి,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రానికి చెందిన వన్నే సుభాష్(42)అనే వ్యక్తి మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కోటగిరి ఎస్సై సందీప్ తెలిపారు. సుభాష్ తాగుడుకు బానిస కావడంతో అతని భార్య చిన్న కొడుకును తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. సుభాష్ పెద్ద కొడుకు బాబాయ్ సాయిలు వద్ద ఉంటూ చదువుకుంటున్నాడు. సుభాష్ ఒక్కడే ఇంట్లో ఉంటూ కూలీ పని చేసుకుంటూ జీవించే వాడు. సోమవారం సుభాష్ ఇంట్లో నుంచి బయటకు రాకపోవడంతో తలుపులు తెరిచి చూడగా దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి సోదరుడు సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రుద్రూరులో యువకుడి అదృశ్యం

కోటగిరి,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): రుద్రూరు గ్రామానికి కర్రోళ్ల విజయ్(33)అనే వ్యక్తి అదృశ్యమైనట్లు రుద్రూరు ఎస్సై సాయన్న తెలిపారు. విజయ్‌కి ప్రియాంకతో ఆరు సంవత్సరాల క్రితం పెళ్లి కాగా వీరికి ఒక బాబు ఉన్నారు. గత సంవత్సరం ఇల్లు కట్టడానికి అప్పులు ఎక్కువ కావడంతో మద్యానికి బానిసై మతిస్థిమితం కోల్పోయినట్లు ఎస్సై తెలిపారు. గతంలో విజయ్ ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లి రెండు నెలల అనంతరం ఇంటికి తిరిగి వచ్చేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. గత నెల 11వ తేదీన విజయ్ కుమార్ ఇంట్లో నుంచి వెళ్లిపోయి ఇప్పటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విజయ్ కుమార్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కిసాన్‌నగర్‌లో అంబలి పంపిణీ

ముప్కాల్ ,ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలంలోని కిసాన్ నగర్ లయన్స్ క్లబ్ భవనంలో అంబలి పంపిణీ కార్యక్రమాన్ని ప్రారం భించిన లయన్స్ క్లబ్ సభ్యులు. వేసవిలో ప్రయాణీకుల దాహార్తిని తీర్చ డానికి ఉచిత అంబలి కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు. అంబలి కార్యక్రమం ప్రతిరోజు రెండు నెలల పాటు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చాకులింగం, దినేష్‌పటేల్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనలో ఇద్దరికి జైలు శిక్ష

ఆర్మూర్ టౌన్ , ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణం, కమ్మర్‌పల్లి మండలానికి చెందిన ఇద్దరికి వేర్వేరు ఘటనలో సెకండ్ క్లాస్ న్యాయాధికారి గట్టు గంగాధర్ జైలుశిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన పట్టణానికి చెందిన దేవరాజ్‌కు మూడురోజుల సాధారణ జైలుశిక్ష అలాగే న్యూసెన్స్ కేసులో కమ్మర్‌పల్లికి చెందిన షేక్ మునీర్‌కు రెండు రోజుల సాధారణ జైలు శిక్షను సెకంట్‌క్లాస్ న్యాయాధికారి విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

బోధన్‌రూరల్,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో మద్యం తాగి సోమవారం రాత్రి వాహనం నడిపిస్తున్న పోతంగల్ గ్రామానికి చెందిన మారుతిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి శేషతల్ప సాయి మద్యం తాగిన వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష విధించారని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

బోధన్‌రూరల్,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది వెంకటేశ్వర్ రావు దేశాయ్ కుమారుడు ప్రీతం దేశాయ్(45) మంగళవారం మధ్యాహ్నం ఆకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు. ప్రీతం దేశాయ్ అందరితో కలిసిమెలిసి ఉండేవాడని, రాజకీయంగా అందరితో సత్సంబంధాలు ఉండేవి అన్నారు. కుమారుడి ఆకస్మిక మరణంతో మాజీ మున్సిపల్ చైర్మన్ సునీతా దేశాయ్, సీనియర్ న్యాయవాది వెంకటేశ్వర దేశాయ్ కన్నీటి పర్యంతమయ్యారు. అందరితో కలివిడిగా ఉండే ప్రీతం ఒక్కసారిగా గుండెపోటుతో మృతి చెందడంతో అందరిని కంటతడి పెట్టించింది. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, పట్టణ ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అంత్యక్రియలు బుధవారం రుద్రూరులో నిర్వహించబడతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

గోదావరి బ్యాక్ వాటర్‌లో గుర్తు తెలియని శవం లభ్యం

నందిపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉమ్మెడ శివారులో ఉన్న అర్గుల్ రాజారాం గుత్ప ఎత్తిపోతల పథకం మొదటి పంప్ హౌస్ వద్ద గోదావరి నది బ్యాక్ వాటర్‌లో మంగళవారం గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు ఎస్ఐ ఎం చిరంజీవి తెలిపారు. మృతునికి 50 నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉంటుందని, చామన చాయ రంగులో ఉండి, శవం పూర్తిగా కుళ్ళిపోయి ఉందని పోలీసులు చెప్పారు. గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి పేర్కొన్నారు.

నేటి నుంచి తొర్లికొండలో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో బుధవారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, విడిసి సభ్యులు తెలిపారు. బుధవారం ఆలయం ప్రత్యేక పూజలు, 3వ నిత్య పూర్ణాహుతి, యజ్ఞం, 4న దొంగల దోపు, స్వామి పల్లకి సేవా ఊరేగింపు 5న స్వామి వారి కల్యాణోత్సవం, 6న బలిహారణం, నిత్య హోమం, 7న రాత్రి రథోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు, విడిసి సభ్యులు తెలిపారు.

ఫటా..ఫట్...

ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తాం

● వేణుగోపాల్, తహసీల్దార్, బిచ్కుంద



బిచ్కుంద,ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తలిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ వేణుగోపాల్ అన్నారు.

ఆంధ్రజ్యోతి: మంజీర పరీవాహక ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుక రవాణాపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

తహసీల్దార్: ప్రభుత్వ అనుమతులు లేకుండా మంజీర నుంచి అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తాం.

ఆంధ్రజ్యోతి: పట్టణంలోని చుట్టుపక్కల గుట్టల ప్రాంతాల నుంచి మొరం తవ్వకాలు చేస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

తహసీల్దార్: అభివృద్ధి పనుల నిమిత్తం రెవెన్యూకు రుసుము చెల్లించకుండా మొరం తవ్వకాలు చేస్తే జేసీబీ సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానా విధిస్తాం.

ఆంధ్రజ్యోతి: భూముల రిజిస్ట్రేషన్ కోసం కొందరు సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాటిపై మీ సమాధానం?

తహసీల్దార్: భూముల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే విషయం నా దృష్టికి రాలేదు. అలాంటిది ఏమైనా ఉంటే నేరుగా నాకు ఫిర్యాదు చేయవచ్చు. వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: రెవెన్యూ కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోవడం వల్ల ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఏమంటారు?

తహసీల్దార్: ప్రభుత్వ పథకాల లబ్ధి కోసం ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉంటున్నారు. సమయపాలన పాటించని వారికి మెమో జారీచేస్తాం.

ఆంధ్రజ్యోతి: రేషన్ దుకాణాలలో రేషన్ సరుకుల పంపిణీలో అకతవకలు జరుగుతున్న ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై మీ సమాధానం?

తహసీల్దార్: రేషన్ దుకాణాలలో పంపిణీ అవుతున్న నిత్యావసర సరుకులు ఆన్‌లైన్‌లో పొందుపరిచి పంపిణీ చేస్తున్నవే. అవినీతికి పాల్పడితే ఇట్టే తెలిసిపోతుంది. అలా కాకుండా డీలర్ అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం.



అసంపూర్తిగా ఉన్న పిల్లర్లు

ఆంధ్రజ్యోతి ఫోకస్

నత్తకే నడక నేర్పేలా..!

● ఏడాదైనా పూర్తి కాని కప్పలవాగుపై హైలెవల్ వంతెన పనులు ● కూలీలను సమాకూర్చని కాంట్రాక్టర్
● పట్టించుకోని సంబంధిత అధికారులు ● వర్షాకాలంలోపు వంతెన పనులు పూర్తయ్యేనా!?

సిరికొండ ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గడ్కోల్ పక్కనే గల కప్పల వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణపనులు ప్రారంభించి ఏడాది గడిచినా పనులు ముందుకు కదలడం లేదు. నత్తకే నడక నేర్పేలా పనులు సాగుతున్నాయి. వాగుపై గల లోలెవల్ వంతెనతో ప్రతీ వర్షాకాంలో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే దానితో గత ప్రభుత్వ హయాంలో వంతెన నిర్మాణానికి రూ.12 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వంతెన నిర్మాణానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి 19 జనవరి 2024న శంకుస్థాపన చేశారు. గత వేసవి కాలంలో వేగంగా పనులు చేయించిన కాంట్రాక్టర్ వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత చాలాకాలం వరకు పనులు చేపట్టలేదు. గడ్కోల్ గ్రామస్థులు అనేకసార్లు అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఎట్టకేలకు గత 15రోజుల క్రితం కాంట్రాక్టర్ పనులను ప్రారంభిండంతో రైతుల్లో కొంత ఆనంద పడ్డారు. కొన్ని పిల్లర్ల పనులు సగం వరకు పూర్తి కాగా వాటిని ఎత్తు పెంచడానికి సదరు కాంట్రాక్టర్ కూలీల సంఖ్యను పెంచకపోవడంతో ఇంతకు వర్షాకాలం లోపు వంతెన నిర్మాణ పనులు పూర్తి అవుతాయనే సందేహాలు గ్రామస్థులు, రైతుల్లో రేకెత్తుతున్నాయి. కూలీలను పది మందిని కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఇలాంటి అనుమానాలు గ్రామస్థులు కలుగుతున్నాయి. సుమారు తొమ్మిది పిల్లర్లు ఎత్తు పెంచినప్పుడే స్లాబ్ వేసేందుకు అవకాశం ఉంటుంది. వంతెనకు రెండువైపులా మట్టిని నింపాల్సి ఉంది. వంతెనకు అటువైపు ఉన్నందున వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. ఈసారి వంతెన నిర్మాణ పనులు పూర్తికాకపోతే గడ్కోల్ గ్రామరైతులకే కాకుండా దూరప్రయాణం చేసే ప్రజలకు, తూంపల్లి, కొండపూర్ తదితరగ్రామాల ప్రజలు నిజామాబాద్ తదితర పట్టణాలకు వెళ్లడానికి సిరికొండ మీదుగా తిరిగివెళ్లాల్సి వస్తోందని చెప్తున్నారు. పంటలు సాగుచేయడానికి సైతం అనేక అష్టకష్టాలు పడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణ పనులు నత్తనడక సాగడానికి ప్రధాన కారణం ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడమేనని కాంట్రాక్టర్ చెప్తున్నట్లు గడ్కోల్ గ్రామ పెద్దలు అంటున్నారు. పనులు చేసినదానికి నేటివరకు పైస విడుదల చేయలేదని కాంట్రాక్టర్ ఆవేదనవ్యక్తం చేస్తున్నట్లు చెప్తున్నారు.

వంతెన పూర్తికాకపోతే ఇబ్బందులే..

కప్పల వాగుపై వంతెన నిర్మాణ పనులు పూర్తి కాకపోతే తమ కష్టాలు తీరవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పంట పొలాలు, తోటలు అన్నీ వంతెనకు అటు వైపు ఉన్నందున పంటలు సాగు చేయడానికి విత్తనాలు, ఎరువులు, కూలీలను తరలించాలంటే కొండపూర్, ముషీర్‌నగర్, పూసలతండా మీదుగా తరలించాల్సి వస్తోందని చెప్తున్నారు. పంటలు వేసిన తర్వాత చూడానికి వెళ్లాలన్నా.. నీళ్లను పారించడానికి వెళ్లాల్సి ఉంటుంది. గత ఏడాది వర్షాకాలంలో వంతెనకు ఆనుకుని నిర్మించిన చెక్‌డ్యాం వారికి రహదారి అయ్యింది. దీనిపై నుంచి చాలామంది పడిపోయారు. ఒకరిద్దరికి చేతులు, కాళ్లు విరిగిన ఘటనలు ఉన్నాయని గ్రామస్థులు చెప్తున్నారు.

వంతెన పనులు వేగంగా చేయాలి

కూలీల సంఖ్యను పెంచి పనులను వేగంగా చేయిస్తేనే త్వరగా నిర్మాణం పూర్తవుతుందని గడ్కోల్ రైతులు చెప్తున్నారు. పది మందిలోపు కూలీలతో పనులు ముందుకు సాగవంటున్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు వేగంగా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పనులు వేగంగా చేపడతాం

● పుష్పాల గంగాధర్, ఏఈ, ఆర్‌అండ్ బీ

వంతెన పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌కు ఈనెలలో బిల్లులు చెల్లిస్తామని ఉన్నతాధికారుల నుంచి సమాచారం ఉంది. బిల్లులు రాగానే కాంట్రాక్టర్ పనులను వేగవంతం చేస్తారని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో ఈవర్షాకాలం లోపు వంతెన పనులు పూర్తి చేయిస్తాం.





ఉత్సవాలకు ముస్తాబవుతున్న ఆలయం

సంతోషిమాతా, సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు పూర్తి

● నేటి నుంచి ప్రారంభంకానున్న విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని సంతోషిమాతా సాయిబాబా పునఃనిర్మాణ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. గత రెండు సంవత్సరాలుగా ఆలయ పునఃనిర్మాణం పనులు ప్రారంభించిన దేవాదాయ శాఖ అధికారులు ఈ సంవత్సరంతో పనులు పూర్తి కావడంతో పునఃప్రతిష్ఠాపన పూజలను నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు పూజాదికార్యక్రమాలు నిర్వహించి ఈనెల 4వ తేదీన దేవతలను ప్రతిష్ఠాపన చేయనున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రభుత్వం అందించిన నిధులతో పాటు భక్తులచే విరాళాలను స్వీకరించి ఆలయాన్ని పునఃనిర్మాణం చేశారు. రెండు సంవత్సరాలుగా ఆలయంలో ఆగమ శాస్త్రానికి అనుగుణంగా ఆలయ నిర్మాణం పనులు నిర్వహించారు. దేవాదాయ శాఖ అధికారులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని దేవాలయాన్ని రెండు సంవత్సరాల్లో పూర్తయ్యేటట్లు చర్యలు తీసుకున్నారు. శ్రీసంతోషిమాతా సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపనతోపాటు యంత్రాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

ఉప ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన

సంతోషిమాత, సాయిబాబా దేవాలయంలో సంతోషిమాత సాయిబాబా ఆలయాలతోపాటు ఆలయ ప్రాంగణంలో వివిధ ఉప ఆలయాల్లో దేవతలను ప్రతిష్ఠించనున్నారు. ఉప ఆలయాల్లో లక్ష్మిగోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ద్వారపాలకులు, గరుడ్ మంతుడు, ధ్వజస్తంభం, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, శివపంచాయతన సమేత ఆంజనేయస్వామి, శివపార్వతులు, లింగం, నంది, నవగ్రహాలు కొలువుదీరనున్నాయి. ఆలయంలో పునఃనిర్మాణం పనులకు తుదిమెరుగులు దిద్దిన ఆలయ కమిటీ ప్రతినిధులు బుధవారం నుంచి జరుగనున్న ప్రతిష్ఠాపన పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



ప్రతిష్ఠించనున్న విగ్రహాలు ఇవే..

ప్రతిష్ఠాపన పూజాధికార్యక్రమాలు

మూడు రోజుల పాటు నిర్వహించనున్న ప్రతిష్ఠాపన పూజలో మొదటిరోజు బుధవారం రోజున విశ్వక్‌సేన ఆరాధన, గణపతి గౌరవిపూజ, పుణ్యాహవచనం, అఖండదీపారాధన, యాగశాల ప్రవేశం, గోపూజ, ఆచార్య రుత్విక్ సమర్పణ, నవగ్రహ, వాస్తు యోగిని క్షేత్రపాల, సర్వతోభద్ర మండల స్థాపన, కుండ సంస్కార పూర్వక అగ్ని ప్రతిష్ఠ స్థాపిత హోమాలు జరుగనున్నాయి. రెండోరోజు గురువారం మండపాల పూజ, హవనము, యంత్రాల జపం, పారాయణం, దేవతా మూర్తులకు విశేష నానావిధ ఔషధి గంగానది పవిత్ర జలాల పూరిత అభిషేకం, బలిప్రధానం, ధ్వజస్థాపన, ధాన్యాది వాసం, ఫల పుష్ప శయ్యాది వాసాల పూజలు నిర్వహించనున్నారు. మూడవ రోజైన శుక్రవారం యంత్రాల విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు జరుపనున్నారు.

భక్తి



దేవతామూర్తులు

దైవ ఆరాధనతోనే ప్రశాంతత

● పరమానంద స్వామీజీ

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): హరేకృష్ణ హరేకృష్ణ భక్తుల భజనలతో దయాల్ నితాయి గౌరంగ విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా సాగాయి. మంగళవారం జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ ఇస్కాన్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీదయాల్ నితాయి గౌరంగ పూజ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రణవానంద దాస్ ప్రభూజీ, ప్రేమ్‌నర్తనానంద స్వామీజీ ప్రతిష్ఠాపన పూజలు చేశారు. పూజలో భాగంగా వేదమంత్రాలతో పంచామృత అభిషేకాలు నిర్వహించి విశేష పుష్పార్చన పూజలు చేశారు. స్వామి నామాలతో అష్టోత్తర నామార్చన పూజలు చేసి ఘనంగా మహాహారతిని సమర్పించుకున్నారు. నేటి ఆధునిక జీవితంలో ప్రతీఒక్కరు తమ దైనందిత జీవితంలో ప్రశాంతత లేక మనుగడ సాగిస్తున్నారని దైవారాధనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రణవానంద దాస్ ప్రభూజీ అన్నారు. భక్తులు ఆధ్యాత్మిక చైతన్యంతో ప్రకృతితో మమేకమై ముందుకు సాగినప్పుడే భూమిపై మనుగడ సాగుతుందని అన్నారు. ప్రతీరోజు దైవానుగ్రహం కోసం సమయాన్ని కేటాయించి పూజాధికార్యక్రమాలు చేయడం ద్వారా మనం తీసుకునే నిర్ణయాల్లో నిర్ణయాత్మకంగా ఉంటాయని అన్నారు. ప్రకృతి పట్ల అవగాహన పెంచుకొని ప్రకృతి ఆరాధన చేసినప్పుడే దైవం మనకు అనుకూలంగా ఉండి చేపట్టే ప్రతీ పనిలో విజయం లభిస్తుందని అన్నారు. భగవంతుడి యొక్క ప్రేమ స్వరూపాన్ని స్వయంగా భగవంతుడే మన నగరానికి వచ్చాడని అన్నారు. సంకీర్తన ప్రతి ఒక్కరికి అందజేయాలనే ప్రేమతో స్వామి ప్రతిష్ఠాపన పూజలు జరుపుతున్నామని అన్నారు. ప్రతీఒక్కరు వీలుచూసుకొని స్వామివారి సేవలో తరించాలని సూచించారు. భక్తుల కీర్తనలు, భజనలు హరే కృష్ణ హరే కృష్ణ నామాలతో మారుమోగాయి. అనంతరం ప్రాంగణంలో నిర్వహించిన మహా అన్నప్రసాదంలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ కంఠేశ్వర్ శాఖ అధ్యక్షులు రామానందరాయ్ ప్రభూజీ, పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో

పనిచేయని నిఘానేత్రాలు!

● ఏడాది దాటినా పట్టించుకోని అధికారులు ● పలు కేసుల్లో ప్రైవేట్ కెమెరాలపై ఆధారపడిన పోలీసులు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో సీసీ కెమెరాలు పనిచేయక సంవత్సరం దాటినా అధికారులు పట్టించుకోవడం లేదు. పలు కేసులను ఛేదించడానికి పోలీసులు ప్రైవేట్ సీసీ కెమెరాలు ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో ఉన్న ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పించి గ్రామాలు, మున్సిపల్ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రయత్నాలు చేశారు. అందులో భాగంగా మున్సిపల్ పరిధిలో ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా గత సంవత్సరం నుంచి ఆ సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. ప్రతీరోజు మున్సిపల్ పరిధిలో నిత్యం ఏదోఒక చోట చోరీలు, ఇతర ఘటనలు జరుగుతుంటే వాటిని ఛేదించడానికి పోలీసులకు సీసీ కెమెరాలు ప్రధాన పాత్ర వహించేవి. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమంటూ చెప్పే అధికారులు సీసీ కెమెరాలపై దృష్టి సాధించడం లేదు.

పోలీసులు, మున్సిపల్ అధికారుల ప్రేక్షక పాత్ర

సీసీ కెమెరాల ఏర్పాట్లు మరమ్మతుల విషయంలో పోలీసులు, మున్సిపల్ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. చాలా గ్రామాల్లో సైతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్న పోలీసులు పట్టణకేంద్రమైన ఆర్మూర్‌లో సీసీ కెమెరాలు సరిగా ఏర్పాటుచేయకపోవడం, ఏర్పాటుచేసిన చోట వాటి నిర్వహణ బాధ్యతను తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో ఇటీవల చోరీలు చైన్‌స్నాచింగ్, అర్ధరాత్రి వేళల్లో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. ప్రజలకు సీసీ కెమెరాల పట్ల అవగాహన కల్పించి మున్సిపల్ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పట్టణంలోని గోల్‌బంగ్లా, పాత బస్టాండ్ అంబేద్కర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, మహాలక్ష్మీ కాలనీ, యోగేశ్వర కాలనీ, మామి డిపల్లి చౌరస్తా, పెర్కిట్ చౌరస్తాతోపాటు జాతీయ రహదారుల వద్ద సీసీ కెమెరాలు పనిచేస్తూ ఉండేవి. దీంతో ఎక్కడైనా యాక్సిడెంట్ జరిగినా, దొంగతనం జరిగిన లేదా ఎవరైనా తప్పిపోయిన కేసులను ఛేదించేవారు. కానీ ప్రస్తుతం సీసీ కెమెరాలు పనిచేయక పోలీసులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పలు కేసులను ఛేదించడానికి ప్రైవేటు సీసీ కెమెరాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. అలాగే మున్సిపల్ పరిధిలో కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



జర దేఖో!!

పాత బస్టాండ్ సమీపంలో పనిచేయని సీసీ కెమెరాలు

అంబేద్కర్ చౌరస్తాలో పనిచేయని సీసీ కెమెరాలు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

● తిరుపతి నాయక్, బీజేపీ నాయకుడు



మున్సిపల్ పరిధిలో పని చేయని సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించాలి. లేదా కొత్త వాటిని ఏర్పాటుచేయాలి. అపార్ట్‌మెంట్‌లు, షాపుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని చెప్తున్న పోలీసులు ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు పనిచేయకపోయినా పట్టించుకోవడం లేదు. తక్షణమే సీసీ కెమెరాల ఏర్పాటుకు అధికారులు స్పందించాలి.

హెచ్‌సీయూ భూముల విషయంలో

ప్రభుత్వం వెనక్కి తగ్గాలి: ఏబీవీపీ



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థులు

డిచ్‌పల్లి, ఏప్రిల్1 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపాలని, ఆ భూములను యూనివర్సిటీ యాజమాన్యానికి అప్పగించాలని డిమాండ్‌చేస్తూ తెలంగాణ యూనివర్సిటీశాఖ ఆధ్వర్యంలో యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రెరీ వద్ద నిరసన తెలియజేస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు శివ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులు చదువుకునే యూనివర్సిటీలపై కక్ష్య కట్టిందని వాటి భూములను కాజేసి తన అనుయాయులకు అప్పగించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూస్తున్నారని అన్నారు. గతంలో విద్యార్థులు మేధావులు, విద్యావేత్తలు వ్యతిరేకించినా అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను హైకోర్టు నిర్మాణం పేరిట 100 ఎకరాలు లాక్కున్నారని, ఇప్పుడు డెవలప్‌మెంట్ పేరుతో 400ఎకరాల హెచ్‌సీయూ భూములు దొబ్బడానికి ప్రయత్నిం చేస్తున్నారని అన్నారు. యూనివర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలు పరంపరగా కొనసాగిస్తుందని విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించడానికి ఈ ప్రభుత్వం పూనుకుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తరుణ్, సమీర్, అజయ్, అశోక్, పృథ్వీ, అనిల్, నరేందర్, శివ, అశ్విత్, హరినాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ కార్యకర్తలకు అవకాశం ఇవ్వాలి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ భవన్‌లో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విపుల్‌గౌడ్ అధ్యక్షతన మంగళవారం మొదటి జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇన్‌చార్జిలు రంగనాథ్, వెంకటరామారావు హాజరై మాట్లాడుతూ.. యువజన కాంగ్రెస్ పార్టీలో పునాది లాంటిదని పార్టీ తీసుకునే ప్రతి కార్యక్రమంలో ముందుండాలని అన్నారు. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులకు అవకాశం ఇవ్వాలని తీర్మానం చేశారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలు బలంగా ఉన్నప్పుడే గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీ మనుగడ కొనసాగుతుందని పార్టీ ఏ కార్యక్రమాలు ఇచ్చిన యువజన కాంగ్రెస్ కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు విక్కియాదవ్, నరాల నిహార్, జిల్లా ఉపాధ్యక్షులు అనుపాల్ కిరణ్, ప్రధాన కార్యదర్శులు నరేందర్‌గౌడ్, ఆదిత్య పాటిల్, ఇర్ఫాన్, రాజుగౌడ్, రషీద్, ముద్దసిర్, నియోజకవర్గ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రామారావు మహరాజ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మంగళవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్ ఉమ్మడి జిల్లా మాలాధారులు, గిరిజన ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సభ అధ్యక్షుడిగా లోక్య నాయక్, డాక్టర్ బీలోజీ నాయక్‌లు వ్యవహరించగా ముఖ్య అతిథిగా జితేందర్ మహరాజ్, నిజామాబాద్ గిరిజన ఆదివాసి చైర్మన్ యాదగిరి నాయక్, మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ అధ్యక్షుడు చంద్రునాయక్, డాక్టర్ మోతిలాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో సేవాలాల్ మాలాదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రపంచ ఆటిజంపై అవగాహన కార్యక్రమం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆటిజం స్పెక్ట్రమ్ డిజాస్టర్ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతీ సంవత్సరం ఏప్రిల్ 2న ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ కార్యక్రమానికి ఐఎంఏ మాజీ అధ్యక్షుడు జీవన్‌రావు, ఆధ్యాత్మిక కార్యకర్త చిరంజీవాచార్యులు హాజరై ప్రారంభదశలోనే ఆటిజంను గుర్తించడం సరైన చికిత్స అందించడం వంటి అంశాలపై వివరించారు. డాక్టర్ విశాల్ చైల్డ్ గైడెన్స్ క్లీనిక్ ఆధ్వర్యంలో ఆటిజం లక్షణాలు, గుర్తింపు, చికిత్సలపై వివరించారు. భావవ్యక్తీకరణ లోపం, సామాజిక పరిచయం సమస్యలు, పరిసరాలలో మార్పుల పట్ల అత్యధిక సున్నితత్వం, స్పీచ్ అండ్ బిహేవియర్ తదితర అంశాలను వివరించారు. ఆటిజం ఉన్న పిల్లలకు సమాజం, ఉపాధ్యాయులు, వైద్య నిపుణులు కలిసికట్టుగా మద్దతుగా నిలవాలన్నారు. తల్లిదండ్రులు సమయానికి వైద్య సలహాలు తీసుకోవాలని ఆయన సూచించారు.

మత్తడి మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేయండి

ఇందల్వాయి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరారం శివాలయం దగ్గర మత్తడి కాలువ మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ గౌరారం గ్రామస్థులు మంగళవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. మత్తడి కాలువ కింద దాదాపు 200 ఎకరాలు రైతులు వ్యవసాయ పంటను పండిస్తున్నారని అన్నారు. లింగోజీ చెరువులో మాటుకాలువ చెక్‌డ్యామ్ మరమ్మతులు, లీకేజీ, కాలువల మీద పశువులు పోవడానికి కల్వర్టు ఏర్పాటు కోసం నిధులు మంజూరు చేయాలని కోరగా అందుకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి సానుకూలంగా స్పందించి సంబంధిత ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. దీంతో గౌరారం గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యేశల దాసు, మాముళ్ల కిష్టయ్య, గూండ్ల ప్రసాద్, వేల్పుల హరీష్, గుడాల సాయికుమార్, కోమన్‌పల్లి ప్రశాంత్, గంగరాజ్యం, కావ్య, తులసమ్మ, దత్తు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని గ్రామీణ ప్రజలకు తెలియజేసే బాధ్యత కార్యకర్తలపై ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్ సూచించారు. మంగళవారం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన సన్నబియ్యం కార్యక్రమంలో మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి కాంగ్రెస్ అభ్యున్నతి కోసం తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు శ్యామ్‌సన్, ధర్మాగౌడ్ పాల్గొన్నారు.

చెత్తకు నిప్పు.. తగలబడిన కారు



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):నగరంలోని ఎల్లమ్మ గుట్ట ప్రాంతంలో చెత్తకు నిప్పు పెట్టగా అక్కడే ఉన్న పాత కారు తగలబడిన ఘటన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. ఎల్ఐసీ కార్యాలయం వెనుక ప్రాంతంలో చెత్త పేరుకుపోగా గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టగా చెత్త పక్కనే ఉన్న పాత కారు మంటల్లో కాలిపోయింది. ఈ ఘటనను చూసిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలు ఆర్పారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. మంటలు ఎక్కువగా చెలరేగి ప్రమాదం జరిగే అవకాశం ఉండగా ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):ఐదోటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యాల్‌కల్ రోడ్ వద్ద మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు 5వ టౌన్ ఎస్సై గంగాధర్ తెలిపారు. మార్చి 31న వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా గాజుల్‌పేట్ కు చెందిన గజానంద్ మద్యం తాగి వాహనం నడుపగా అతన్ని పోలీసులు కోర్టులో హాజరుపర్చగా రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు. ఏవరైనా నిబంధనలకు విరుద్ధంగా మద్యం తాగి వాహనాలు నడిపితే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

స్వచ్ఛంద సంస్థకు విద్యుత్ ఉద్యోగుల ఆర్థిక సహాయం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో చింతకుంట స్వచ్ఛంద సంస్థకు రూ.20వేల సహాయాన్ని అందజేశారు.నిజామాబాద్ రూరల్ మండలం చింతకుంటలోని స్వచ్ఛంద సంస్థకు మంగళవారం రూ.20వేలను నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాపెల్లి రవీందర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా విద్యుత్ ఉద్యోగులు తమ విధినిర్వహణతో పాటు సమాజసేవలో ముందుంటారని తెలిపారు. ఈ విరాళం అందజేయడం ద్వారా మానసిక వికలాంగులకు, వృద్ధులకు, అనాధలకు, వితంతువులకు సహాయం అందించిన వారమవుతామన్నారు. టీజీఎన్‌పీ డీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ప్రోత్సాహంతో స్వచ్ఛందంగా ప్రతి ఉద్యోగి ముందుకు వచ్చి వీలైనంత సహాయం చేయడం సంతృప్తి ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా సీఎం రేవంత్‌రెడ్డి

● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మహిళలకు అండగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. సోమవారం రూరల్ మండలంలోని మల్లారం గ్రామంలో రేషన్ షాపుల్లో సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. మహిళలకు పావలా వడ్డీ కింద పెద్ద మొత్తంలో రుణాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. రైతు సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీలు విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. వారి మాటలు నమ్మి ప్రజలు ఎవరూ మోసపోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ చంద్రశేఖర్‌గౌడ్, నాయకులు బాగారెడ్డి, పార్టీ అధ్యక్షుడు ఎల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీను, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం..

రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ముదక్‌పల్లి, నర్సింగ్‌పల్లి గ్రామాల్లో రేషన్ షాపుల ద్వారా ఇస్తున్న సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ రాజాకిషన్, సాయిలు, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఎస్సార్ కళాశాలలో ఘనంగా వీడ్కోలు పార్టీ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి):నగరంలోని ఎస్సార్ జూనియర్ కళాశాలలో వీడ్కోలు పార్టీ ఘనంగా జరిగింది. మంగళవారం రాత్రి గంగాస్థాన్ క్యాంపస్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీజీఎం గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్ఠలను తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా విద్యార్థులు చేసిన జానపద నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి శ్రీకాంత్ ప్రిన్సిపాల్ హనుమంతరావు నరసింహారెడ్డి, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి : తహసీల్దార్ వెంకట్రావ్



నగరంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న గడుగు గంగాధర్



రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న తాహెర్‌బిన్ హందాన్, కేశవేణు, తదితరులు



రామడుగులో బియ్యం పంపిణీ చేస్తున్న ఆర్ఐ

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నగరంలో నిర్వహించారు. నగరంలోని కోటగల్లి, దుబ్బ, తదితర ప్రాంతాల్లో రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశవేణు, గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఈనెల నుంచి పేదలకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సీఎంకు, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. దుబ్బ వద్ద నిర్వహించిన సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమీషన్ సభ్యుడు గడుగు గంగాధర్ పాల్గొని లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రత్నాకర్, రామర్తి గోపి, రాజేష్, అరుణ్, సుభాష్‌జాదవ్, ఉషా, తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి:సన్నబియ్యం పథకం రేషన్ కార్డు ద్వారా పేదలకు పంపిణీ చేయడం దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానం పొందిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్‌రాజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రెవెన్యూ అధికారులతో కలిసి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజేశ్వర్, సింగిల్ విండో చైర్మన్ మల్లికార్జున్, మాజీ సర్పంచ్ మిట్టపల్లి గంగారెడ్డి, చెలిమెల నర్స య్య, చెలిమెల శ్రీనివాస్, పుప్పాల సుభాష్, సురేందర్‌గౌడ్, లాల్‌సింగ్, బొక్కలబాలయ్య,అర్గుల్‌రాజేశ్వర్‌రెడ్డి,లాలాగౌడ్,నారాయణ, పాల్గొన్నారు.

సిరికొండ: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అధికారులతో కలిసి మంగళవారం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. రామడుగు గ్రామంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంగారాజంతో కలిసి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గడ్కోల్‌లో మార్కెట్ కమిటీ డైరెక్టర్ రొక్కం సంపత్‌రెడ్డి,పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు రాములుతో బియ్యం పంపిణీ చేశారు. సిరికొండలో దేగాం సాయన్న, ఆసీఫ్,శోభన్ తదితరులు పంపిణీ చేశారు.కొండపూర్‌లో మాజీ సర్పంచ్ గౌ సొద్దిన్,నీరడి శ్రీధర్ తదితరులు పంపిణి చేశారు,చిన్నవాల్గోట్‌లో మాజీ సర్పంచ్ మహిపాల్, రొండ్ల గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించగా న్యావనందిలో మార్కెట్ కమిటీ డెరుక్టర్ రిక్కా ముత్తెన్న,యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీన్,మాజీ ఎంపీటీసీ నరేందర్ సన్నబియ్యం పంపిణీ చేశారు.

ఇందల్వాయి:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ కార్యక్ర మాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం ప్రారంభించారు. మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో తహశీల్దార్ వెంకట్రావ్ ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసమే సన్నబియ్యం ఉచితపంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిందని రేషన్ కార్డులు ఉన్న ప్రతీ ఒక్కరికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యాన్ని ఉచితంగా అందజేస్తున్నారని అన్నారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అర్హులైన పేదలకు ఉచితంగా సన్నబియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి,డీసీసీబీ డెలిగేట్‌సుధాకర్, సీనియర్ నాయ కులు కర్నమోహన్,రాజన్న, ఆశీష్, నారాయణ, రేషన్‌డీలర్లు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:పేదల ఆకలిని తీర్చడానికే కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, మాజీ ఎంపీపీ అధ్యక్షుడు కంచెట్టి గంగాధర్‌లు అన్నారు. మంగళవారం డిచ్‌పల్లి మండలంలోని ముల్లంగి, ఘన్‌పూర్, మెంట్రాజ్‌పల్లి గ్రామాల్లో రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రెవెన్యూ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐసంతోష్, మాజీ ఎంపీపీ నర్సయ్య, నాయకులు శ్రీనివాస్, గంగారెడ్డి, ధర్మగౌడ్, శ్యాంసన్, అంజయ్య, షాదుల్లా, తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడి ఆచూకీ లభ్యం



తల్లిచెంతకు చేరిన బాలుడు

నిజామాబాద్‌అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో తప్పిపోయిన రెండేళ్ల బాలుడు ఆచూకి లభ్యమైంది. మంగళవారం నగరంలోని గౌతంనగర్‌కు చెందిన కేశిరెడ్డి లత తన కుమారుడితో కలిసి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చింది. ఆసుపత్రిలోని ఒకటో అంతస్తులో గైనకాలజీ వార్డులో చికిత్స చేసుకుంటున్న క్రమంలో బాలుడు అక్కడి నుంచి తప్పిపోయి బస్టాండ్ వైపు వెళ్లాడు. బాలుడు తప్పిపోయినట్లు గమనించిన తల్లి చుట్టుపక్కల వెతికి చివరకు స్థానిక ఎస్‌పీఎఫ్, ఒకటవ టౌన్ పోలీసులకు సమాచారం అందించింది. దీంతో పోలీసులు బాలుడు కోసం గాలించగా పక్కనే ఉన్న బస్టాండ్‌లో డ్యూటీలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ అరుణకు బాలుడు కనిపించడంతో ఆమె ఒకటో టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చా రు. బాలుడిని తల్లివద్దకు క్షేమంగా చేర్చినట్లు ఒకటవ టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

చెట్టుపై నుంచి పడి యువకుడి మృతి

సిరికొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):తూంపల్లి గ్రామానికి చెందిన దాసరి రజనీష్ (38) సోమవారం కొబ్బరికాయలు కోయడానికి చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. చికిత్స నిమిత్తం రజనీష్‌ను నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం నాడు మృతి చెందాడు. రజనీష్ భార్య మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.రామ్ తెలిపారు. శవపంచనామా చేసి పోస్టుమార్టంకు తరలించడం జరిగిందన్నారు.

ఘనంగా మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలోని శ్రీమహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హోమం కార్యక్రమం అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రేఖచంద్రసేనా, తడకమడ్ల శ్రీనివాస్, రేఖ రాము, శ్రీనివాస్, సీతంబర్, ఘన్‌పూర్ గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు.

పునఃప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆహ్వానం



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

నిజామాబాద్‌కల్చరల్, ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి):శ్రీసంతోషిమాత సాయిబాబా ఆలయ పునఃప్రతిష్ఠాపన మహోత్సవ ఆహ్వాన పత్రికను జిల్లా న్యాయాధికారి సునీత కుంచాలకు ఆలయ కమిటీ ప్రతినిధులు అందజేశారు. మంగళవారం సునీత కుంచాలను మర్యాదపూర్వకంగా కలుసుకొని ఆలయంలో జరిగే పునఃప్రతిష్ఠాపన పూజా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్, సంతోషిమాత సాయిబాబా సేవాసమితి అధ్యక్షుడు కాశీనాథ్, ప్రధాన కార్యదర్శి పటేవార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'బీడీ కార్మికులను నిలువు దోపిడీ చేస్తున్న యాజమాన్యం'



మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోగల శివాజీ బీడీ ఫ్యాక్టరీలో బీడీలు చుట్టే కార్మికులకు నాణ్యమైన తునికాకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శివాజీ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమీషన్ దారులు మాట్లాడుతూ బీడీ చుట్టే కార్మికులకు గత కొన్ని నెలలుగా నాసిరకం తునికాకు ఇవ్వడం వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని వెయ్యి బీడీలకు ఇస్తున్న ఆకు కేవలం 500 బీడీలకు మాత్రమే సరిపోతుందని మిగతా 500ల బీడీలకు ఆకు కార్మికులు కొనుగోలు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా చేయడం వల్ల కార్మికులకు నెలకు సుమారు రూ.2వేల ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. యాజ మాన్యం బీడీలకు సరిపడా తునికాకు నాణ్యమైనది అందజేయాలని లేని పక్షంలో కార్మికులను సమీకరించి ఫ్యాక్టరీని ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ నాయకులు కిషన్, మురళి, గణేష్, శ్రీధర్, రఘు, గోవర్ధన్, సాయిలు, నారాయణ, సాయినాథ్, సురేష్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని బుధవారం ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని వినాయక్‌నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద గల సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి ఉదయం 9గంటలకు నివాళులర్పించనున్నారు. 3వ తేదీన గురువారం దొడ్డికొమురయ్య జయంతి కార్యక్రమాన్ని జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో ఉదయం 10.30లకు నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి స్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు.

యువకుల్లో దాగి ఉన్న క్రీడ నైపుణ్యాలను వెలికితీయాలి

బోధన్‌రూరల్,ఏప్రిల్1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో యువకులలో దాగిఉన్న క్రీడ నైపుణ్యాలను వెలికితీయడానికే క్రీడ పోటీలు నిర్వహిస్తున్నామని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. మంగళవారం బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రీమియర్ లీగ్ సీజన్2లో భాగంగా టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రాజారెడ్డి, వీడీసీ చైర్మన్ లక్ష్మారెడ్డి, గాంధారి రమేష్ రెడ్డి, కృష్ణారెడ్డి, పోతారెడ్డి, సుదర్శన్, ఎండీ షబ్బీర్,హైమద్, రవి,టోర్నమెంట్ నిర్వాహకులు మోహన్,రాజు,మనోజ్, కృష్ణ, నూర్, రవి,తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు





రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.130	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	: రూ.145	రూ.210	రూ. 230

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.93,200	రూ.86,000	రూ.1050

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : సికిందర్ (హిందీ) (10.00, 1.00, 4.00, 7.00, 10.00)
స్క్రీన్-2 : మ్యాడ్ స్క్వేర్ (10.35, 1.20, 7.40, 10.25)
: ఎల్-2 ఎంపురాన్ (4.05)
స్క్రీన్-3 : వీర ధీర (10.15)
: సికిందర్ (హిందీ) (1.35)
: మ్యాడ్ స్క్వేర్ (4.35)
: రాబిన్‌హుడ్ (7.20, 10.30)
స్క్రీన్-4 : రాబిన్‌హుడ్ (10.00, 1.10, 4.20)
: వీరధీర (7.30)
: ఎల్-2 ఎంపురాన్ (10.50)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మ్యాడ్ స్క్వేర్ (10.40, 1.20, 4.20, 7.20, 10.20)
స్క్రీన్-2 : రాబిన్‌హుడ్ (10.50, 4.45, 7.30, 10.30)
: ఎల్-2 ఎంపురాన్ (1.30)
స్క్రీన్-3 : సికిందర్ (హిందీ) (11.00, 1.40, 4.30, 7.30, 10.20)

లలితామహల్ : కోర్టు (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : రాబిన్‌హుడ్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : సికిందర్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : మ్యాడ్ స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్